విద్యార్థులకు వరం.. క్రీడా శిబిరం


కబడ్డీ శిక్షణలో క్రీడాకారులు


వాలీబాల్ నేర్చుకుంటున్న చిన్నారులు

- క్రీడలతో శారీరక దారుఢ్యం
- విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి
- ఉదయం సాయంత్రం వేళల్లో క్రీడా శిక్షణ

బంగారుపాళెం: చిన్నారులకు చదువుతోపాటు శారీరక, మానసిక దారుఢ్యం ప్రధానం. కంప్యూటర్లు, ఆండ్రాయిడ్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు ఇతర ఎలక్ట్రానిక్ రాజ్యమేలుతున్న ప్రస్తుత రోజుల్లో చిన్నారులు క్రమంగా వ్యాయామం, క్రీడలకు దూరమవుతున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో చిన్నారులకు క్రీడలపై ఆసక్తి పెంచుతూ బంగారుపాళెంలో పలువురు కోచ్‌లు ఉచిత వేసవి శిబిరాలను నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు వారికి ఇష్టమైన క్రీడల్లో శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. వేసవిలో చిన్నారులు తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా క్రీడలో శిక్షణ పొందుతూ తమ నైపుణ్యాన్ని చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ప్రతి సంవత్సరం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ద్వారా విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాస్కెట్‌బాల్ తదితర క్రీడలపై శిక్షణ ఇస్తూ ప్రతిభను ప్రోత్సహిస్తున్నారు. తోటి విద్యార్థులతో ఎలా ఉండాలి. క్రీడల్లో ఎలా గెలవాలి. గెలుపుఓటములను ఏ విధంగా స్వీకరించాలనే విషయాలు తెలియజేస్తూ, మానసికంగా దృఢంగా ఉండేలా తర్ఫీదునిస్తున్నారు. పిల్లల అభిలాషను గుర్తించి పలువురు తల్లిదండ్రులు రోజూ ఉదయం సాయంత్రం శిక్షణకు పంపుతున్నారు. రోజూ ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు శిక్షణ ఇస్తున్నారు.


బాస్కెట్ బాల్ ఆడుతున్న విద్యార్థులు

వాలీబాల్‌లో శిక్షణ తీసుకుంటున్నా..



గత నెల రోజులుగా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ఉచిత క్రీడా శిక్షణ శిబిరంలో వాలీబాల్ నేర్చుకుంటున్నా. వాలీబాల్ విశ్రాంత కోచ్ సుదర్శన్‌నాయుడు శిక్షణ ఇస్తున్నారు. ఈ శిబిరంలో వాలీబాల్ ఆడడంలో మెలకువలు నేర్చుకుంటున్నా. జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలనేది నా లక్ష్యం.

– హితేష్, ఇంటర్మీడియట్

కబడ్డీ నేర్చుకుంటున్నా..



నాకు కబడ్డీ అంటే చాలా ఇష్టం. కోచ్ అరవింద్ వద్ద శిక్షణ తీసుకుంటున్నా. వేసవి సెలవుల్లో ఉదయంయ సాయంత్రం సమయాల్లో శిక్షణ ఇస్తున్నారు. గ్రామీణ క్రీడైన కబాడ్డీలో మంచి ఆటగాడుగా గుర్తింపు తెచ్చుకోవాలని ఉంది. పాఠశాల క్రీడా మైదానంలో ఇస్తున్న శిక్షణ ఉపయోగంగా ఉంది.

– రాబర్ట్ శ్యాముల్, 9వ తరగతి

బాస్కెట్‌బాల్



బంగారుపాళెంలో నిర్వహిస్తున్న ఉచిత క్రీడా శిక్షణ శిబిరంలో బాస్కెట్‌బాల్ నేర్చుకుంటున్నా. మంచి క్రీడాకారుడిగా రాణించాలని ఉంది. క్రీడాకారులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్ కూడా ఉంటుంది. జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలనేది నా కల. మా కోచ్ మెలకువలు నేర్పుతున్నారు.

– చారూష్, 8వ తరగతి

క్లుప్తంగా

రక్తహీనతతో గర్భిణుల్లో అనారోగ్యం

ఐరాల: రక్తహీనత వల్ల గర్భిణుల్లో పలు ఆరోగ్య సమస్యలు వస్తాయని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. పీహెచ్‌సీలో సోమవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 40 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, అవగాహన కల్పించారు. రక్తహీనత కారణంగా నీరసం, నెలసరి సమయంలో హెచ్చు తగ్గులు, గర్భం ధరించలేకపోవడం, గర్భం వచ్చినా నిలబడకపోవడం, ప్రసూతి మరణాలు పెరిగిపోవడం వంటి సమస్యలు వస్తాయని తెలియజేశారు. పీహెచ్‌సీలో ప్రతి నెలా 9వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేసి తగు సూచనలు, సలహాలు అందిస్తామన్నారు. రక్తహీనతను అధిగమించాలంటే ఐరన్ అధికంగా ఉన్న ఆకుకూరలు, పండ్లు, ఖర్జూరాలు, దానిమ్మ, చిక్కుడు కాయలు లాంటి ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. మాతా శిశు మరణాలను తగ్గించేలా, సురక్షిత ప్రసవాలే లక్ష్యంగా సేవలందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ జీవకళ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు


వృద్ధురాలి నుంచి అర్జీ తీసుకుంటున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: ప్రజల నుంచి వచ్చే వినతులు, సమస్యలపై నిర్లక్ష్యంగా ఉండొద్దని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు బాధితులు వారి సమస్యలను కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. మునిసిపల్ ఇంజనీరు వెంకటరామిరెడ్డి, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు


రైల్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

చిత్తూరు కార్పొరేషన్: మాదకద్రవ్యాల రవాణా అరికట్టేందుకు చిత్తూరు రైల్వేస్టేషన్‌లో డాగ్ స్క్వాడ్‌తో రైల్వేపోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో సోమవారం పలు రైళ్లు, ప్లాట్‌ఫాం, బుకింగ్ ఆఫీస్, పార్శిల్ సెంటర్, వెయిటింగ్‌రూంలో తనిఖీ చేశారు. ఇక మీదట ప్రతిరోజు తనిఖీలు చేయనున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఇది టీడీపీ దిగజారుడు రాజకీయం

చిత్తూరు కార్పొరేషన్: ఇటీవల సాక్షి టీవీ చర్చావేదికలో సీనియర్ జర్నలిస్టు కృష్ణంరాజు మాటలను జగనన్నకు ఆపాదించడం తగదని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ద్రాక్షాయణి హితవు పలికారు. ఆమె సోమవారం మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం దిగజారుడుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. భారతమ్మకు సంబంధమే లేని అంశాన్ని పట్టుకొని ఆమె క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు. ఎల్లోమీడియాలో నిత్యం ఎన్నో అనుచిత వ్యాఖ్యలు చేయించిన జర్నలిస్టులు, నాయకులతో హోంమంత్రి అనిత క్షమాపణలు చెప్పించగలరా? అని ప్రశ్నించారు. సోషల్ మీడియాలో మార్ఫింగ్ పోస్టింగ్‌లు చేయించిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని నిలదీశారు. మహిళలపై రోజురోజుకూ అత్యాచారాలు పెరుగుతున్నట్లు ప్రభుత్వమే అసెంబ్లీ వేదికగా అంగీకరించిందని గుర్తుచేశారు.

హుండీ లెక్కింపు రేపు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించనున్నట్లు ఈవో పెంచల కిషోర్ తెలిపారు. ఆస్థాన మండపంలో ఉదయం 7 గంటలకు హుండీ లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఈ నెల 9న జరగాల్సిన ఈ లెక్కింపు 11వతేదీకి వాయిదా పడిందని, ఆలయ సిబ్బంది, అధికారులు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

వడదెబ్బపై జాగ్రత్తలు అవసరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: వడదెబ్బకు గురికాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని పొలకల రెడ్డివారిపల్లె, పేరయ్యగారిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో రెండు గ్రామాల్లో 90 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. ప్రతి ఒక్కరూ బయటకు వెళ్లాల్సివస్తే టోపీ ధరించాలన్నారు. ప్రథమ చికిత్స అనంతరం సమీపంలోని పీహెచ్‌సీకి తరలించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

ఐరాల: అందరం కలిసికట్టుగా పని చేసి ఈ సారి జగనన్నను సీఎం చేసుకుందామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ పార్టీ నేతలకు సోమవారం పిలుపునిచ్చారు. ఇటీవల మండలానికి చెందిన దొరబాబును వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ వింగ్ సెక్రటరీగా నియమించారు. ఈ నేపథ్యంలో పార్టీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సునీల్‌కుమార్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు చంద్రారెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్, ప్రచార వింగ్, పంచాయతీ రాజ్ అధ్యక్షులు రామచంద్రా, రమణ, ఓబుల్‌రెడ్డి, మురళీ పాల్గొన్నారు.


సునీల్‌కుమార్‌ను సన్మానిస్తున్న అనుబంధ విభాగాల నాయకులు

అందరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలి

తవణంపల్లె: ఆరోగ్య సూత్రాలు పాటించి ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని డాక్టర్ ప్రియాంక తెలిపారు. మండలంలోని పల్లెచెరువులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక రోగులకు, వృద్ధులకు, గర్భిణులకు, బాలింతలకు పరీక్షలు చేయించారు. టి.పుత్తూరులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ కేశవనారాయణ, గోవిందరెడ్డిపల్లెలో, పైమాఘంలో డాక్టర్ మోహన్‌వేలు రోగులకు పరీక్షించి సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


పల్లెచెరువులో రోగులకు వైద్యం చేస్తున్న డాక్టర్ ప్రియాంక

ముగ్గురు విద్యార్థులకు 'షైనింగ్ స్టార్స్' అవార్డులు




అవార్డులు అందుకున్న జోషిక, రోషిత, రోహిత్

ఐరాల: మండల కేంద్రంలోని సమత ఇంగ్లిష్ మీడియం స్కూల్ పదో తరగతి 2024–25 విద్యా సంవత్సరానికి జిల్లా స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు అందుకున్నట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ సురేంద్రరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన షైనింగ్ స్టార్ అవార్డుల్లో తమ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు కె.రోహిత్, రోషిత, జోషిక ఉత్తమ మార్కులు సాధించడంతో కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందుకున్నట్లు వివరించారు. అవార్డులు అందుకున్న విద్యార్థులను కరస్పాండెంట్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఈఏపీ సెట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ




సత్తా చాటిన పీఎస్ఎన్ వివేకానంద, విద్యావికాస్, శ్రీవివేకానంద విద్యార్థులతో నిర్వాహకులు

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని పలు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈఏపీ సెట్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. మురకంబట్టులో ఉన్న పీఎస్ఎన్ శ్రీ వివేకానంద కళాశాలలో చదువుతున్న సాహితీ 1338 వ ర్యాంక్ సాధించి జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. తేజారెడ్డి 1648, గణేష్ 2736, అనీష్ 3559, మన్విత 3636, పవన్‌కల్యాణ్ 5022, లిఖిత 5214, దిలీప్ 5461, మహితా కీర్తి 6178 ర్యాంకులు సాధించినట్లు కరస్పాండెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపల్ నాగరాజశెట్టి తెలిపారు. కొంగారెడ్డిపల్లి విద్యావికాస్ కళాశాలలో చదువుతున్న సంజు 11,625, వినీత 13,775, సంతోషి 15,743, జెనీఫర్ 17,091, సంధ్య 24,472 దివ్య 24,847 ర్యాంకులు సాధించారని కరస్పాండెంట్ ప్రకాష్ చంద్రారెడ్డి తెలిపారు. కామేశ్వర్‌నగర్‌లో ఉన్న శ్రీ వివేకానంద కళాశాలలో చదువుతున్న తరుణ్‌కుమార్ 2,145, హేమేశ్వర్ 4,851, రాకేష్ 7,126, బాలు 11,373, గాయత్రీ 8,593, నిర్మల్ కుమార్ 10,277, రుఫినా 20,256 ర్యాంకులు సాధించారని నిర్వాహకులు మహేంద్ర కుమార్, భాస్కర్‌నాయుడు తెలిపారు.

నేడు గంగ జాతర

బంగారుపాళెం: మండల కేంద్రంలోని దళితవాడలో మంగళవారం గంగజాతర నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెపారు. జాతరలో భాగంగా మంగళవారం ఉదయం అమ్మవారికి అంబళ్లు, సాయంత్రం పొంగళ్లను సమర్పించనున్నట్లు తెలిపారు. రాత్రి అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించిన తరువాత నడివీధిలో కొలువు దీర్చనున్నట్లు చెప్పారు. అనంతరం అమ్మవారికి విశేష పూజలు చేపట్టి భక్తులకు దర్శనం కల్పిస్తారన్నారు. బుధవారం సాయంత్రం ఉట్లోత్సవాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. రాత్రి అమ్మవారిని మేళతాళాలు, కృపకు బాణాసంచా వేడుకల నడుమ జలప్రవేశానికి తరలించనున్నట్లు తెలిపారు.

సుస్థిర వ్యవసాయం లాభదాయకం

పెనుమూరు(కార్వేటినగరం): సుస్థిర వ్యవసాయ విధానాలు పాటించడం ద్వారా ఖర్చులు తగ్గించుకుని అధిక ఆదాయం పొందవచ్చని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత డాక్టర్ దివ్య తెలిపారు. మండలంలోని శాతంబాకం, దాసరిపల్లిలో సోమవారం వికసిత్ కృషి విజ్ఞాన అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ సీజన్‌లో నూతన వంగడాలు కొనుగోలు చేయాలన్నారు. మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని, భూసార పరీక్ష ఆధారంగా ఎరువులు వాడాలని సూచించారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరానికి విచ్చేసిన 55 మంది కంటి జబ్బు రోగులకు పరీక్షలు చేశారు. అందులో 35 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఎంపికైన వారిని చెన్నైకి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించి, మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.


కంటిజబ్బురోగులకు పరీక్ష చేస్తున్న సిబ్బంది

గోడపై గీయించిన శివుడిరూపం తొలగింపు



పాలంతోపు వాటర్ ప్లాంట్ గోడపై వేసిన శివుడి బొమ్మ, తెల్ల పెయింట్ వేసి తొలగిస్తున్న వ్యక్తులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం పాలంతోపు గ్రామంలోని తాగునీటి వాటర్ ప్లాంట్ గోడపై వేసిన ఆది యోగి శివరూపాన్ని గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారని సర్పంచ్ పాపమ్మాల్ సోమవారం బీఎన్ఆర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాటర్‌ప్లాంట్ వద్ద కొందరు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నామని, ఈ ప్లాంట్‌కు వెళ్లే దారిలో శ్రీ జలకంఠేశ్వరస్వామి ఆలయం ఉన్న నేపథ్యంలో సర్పంచ్ ఇటీవల శివుడి ప్రతిమను గోడపై గీయించారు. దీన్ని జీర్ణించుకోలేని కొందరు వ్యక్తులు ఈ రూపాన్ని తెల్లరంగు పెయింటింగ్‌తో చెరిపేశారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేయాలని వివరించారు.

నిత్య యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



చిత్తూరు హైరోడ్డులో మానవహారం నిర్వహిస్తున్న మేయర్ తదితరులు, తవణంపల్లెలో యోగాంధ్రపై అవగాహన ర్యాలీ

తవణంపల్లె: మండల కేంద్రంలో సోమవారం యోగాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తవణంపల్లె సచివాలయ కార్యదర్శి ప్రేమకుమారి ప్రభు ఆధ్వర్యంలో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 21వ తేదీన నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, సంఘమిత్రలు, డ్వాక్రా మహిళలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

యోగాంధ్రపై అవగాహన ర్యాలీ

చిత్తూరు అర్బన్: నేడు ఉన్న పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే యోగా తప్పకుండా నేర్చుకోవాలని చిత్తూరు మేయర్ అముద పిలుపునిచ్చారు. యోగాంధ్ర–2025 కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరంలో జరిగిన యోగాంధ్రపై ర్యాలీ చేశారు. మేయర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలు యోగాంధ్రలో తర్ఫీదు పొందుతున్నారన్నారు. కమిషనర్ నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి సచివాలయ పరిధిలో ఇప్పటికే ర్యాలీలు చేస్తున్నామని.. యోగాపై ఆసక్తి ఉన్నవాళ్లకు శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. అనంతరం హైరోడ్డులో మహిళలతోకలిసి మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, మెప్మా సీఎంఎం వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లోకనాథం, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వారిని అరెస్ట్ చేయాలి


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న దళిత సంఘ నేతలు

పూతలపట్టు (కాణిపాకం): కులం పేరుతో దూషించిన కూటమినేత జయప్రకాష్‌ను అరెస్ట్ చేయాలని దళిత సంఘ నేతలు జీవరత్నం, వెంకటరమణ, సురేంద్రబాబు డిమాండ్ చేశారు. ఇటీవల ఆకనంబట్టు సర్పంచ్ మణిని దుర్భాషలాడి..కులంపేరుతో దూషించిన నేపథ్యంలో దళిత సంఘ నేతలంతా ఏకమై పూతలపట్టు మండలంలోని పోలీస్ స్టేషన్‌లో సోమవారం జయప్రకాష్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాయిస్ రికార్డును కూడా పోలీసులకు సమర్పించారు. పలువురు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక ఎస్సీలపై దాడులు పెరిగాయన్నారు. ఎస్సీలంటే చులకనగా చూస్తున్నామన్నారు. మూడేళ్ల కిందట జయప్రకాష్ అనే వ్యక్తి కులం పేరుతో దూషించడంతో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు అయిందన్నారు. ఈ కేసును వెనక్కి తీసుకోవాలని జయప్రకాష్ మణిని బెదిరించారన్నారు. కేసు వెనక్కి తీసుకోకపోయే సరికి జయప్రకాష్ మణికి ఫోన్ చేసి పత్రికలో రాయలేని పదజాలంతో దుర్భాషలాడాడు. కులం పేరుతో దూషిస్తూ...కుటుంబం మొత్తాన్ని చంపేస్తానన్ని భయపెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అతనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు, హత్యాయత్నం కింద కేసు నమోదు చేయాలని వారు పోలీసులను డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ జిల్లా కో–ఆర్డినేటర్ కోదండపాణి, బీఎస్పీ అధ్యక్షులు సురేంద్రబాబు, బీఎస్పీ నాయకులు చంద్రబాబు, మోహన్, మూర్తి శంకర్, వానాద్రి, అంబేడ్కర్ యువజన సంఘ నేతలు షణ్ముగం, దళిత నేతలు పట్టాభి మురుగేష్, రామ్మూర్తి, సుబ్రమణ్యం, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్లకు అవగాహన


ట్రాక్టర్ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్ఐ

బంగారుపాళెం: ట్రాక్టర్ డ్రైవర్లు నిబంధనలు పాటించి ట్రాక్టర్లు నడపాలని సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ ప్రసాద్ అన్నారు. స్థానిక మామిడి మార్కెట్ యార్డులో సోమవారం సాయంత్రం ట్రాక్టర్ డ్రైవర్లకు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. డ్రైవర్లకు తప్పని సరిగా లైసెన్సులు, వెహికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ ఉండాలన్నారు. ట్రాక్టర్లను వేగంగా నడపరాదని హెచ్చరించారు. ఓవర్‌లోడ్, ట్రాక్టర్‌లో ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. హైవే రోడ్డులో ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. ట్రాక్టర్‌కు ముందు, వెనుక రేడియం స్టిక్కర్స్‌ను అతికించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మల్లప్ప, హెడ్ కానిస్టేబుల్ సారథి, పీసీలు ద్వారక, రమేష్ పాల్గొన్నారు.